# 24. తిరోగామి

**తను** బి.కామ్ చదువుతున్నప్పుడు రమణమూర్తి నాకు పరిచయం అయ్యాడు. ఎడ్వాన్స్‌డ్ అకౌంటెన్సీలో ఏదో సమస్య తలకి పట్టక బోధపరచమని వొచ్చాడు. అలా ఆ ఏడాది చివరిదాకా అతనికి అడిగినప్పుడల్లా పాఠాలు చెప్పేను. "మీకు చాలా శ్రమ ఇస్తున్నాను" లాంటి డైలాగేదో వేసి క్షమార్థంగా చూసేడొకసారి. "అలా అనకు. మర్చిపోయిన పాఠాలు గుర్తుచేస్తూనే మర్చిపోయిన కాలేజీ రోజులు గుర్తుచేసి నాకే బోలెడు ఆనందాన్నిచ్చేవు. నీకే కృతజ్ఞతలు, అసలు!" అన్నాను.

రమణమూర్తి అక్షరాలా "పూర్‌ఫెలో." వాళ్ళ నాన్నగారు రిటైరైపోయిన ఎలిమెంటరీ స్కూల్ టీచరు. వాళ్లమ్మకి నలభై ఏళ్లకన్నా ఉండవుగానీ పక్షవాతం. ఒక నాయనమ్మ. ఒక చెల్లెలూ ఒక తమ్ముడూ.

వెనకటికి ఒక చెయిన్ స్మోకర్ (అనగా విడవకుండా సిగరెట్లు కాల్చేవ్యక్తి) ఒక చెట్టుకింద కూచుని సిగరెట్లు కాలుస్తూ వుండగా ఒక ఆగంతకుడు ఆ చెట్టుకింద (నీడకోసం) చేరి ఇతన్ని కాసేపు గమనించి "అయ్యా, మీరు రోజుకి ఎన్ని సిగరెట్లు కాలుస్తారు?" అన్నాట్ట.

'ఏమో నేనెప్పుడూ లెక్కపెట్టలేదు. అయిదారు పెట్టెలు కాలుస్తానేమో. ఏం, అలా అడిగేరు?'

"ఆగండి! ఆరు పెట్టెలు కదా! అంటే-" అని అక్కడ పడివున్న ఖాళీ సిగరెట్టు పెట్టె ఏరి, "ఈ పాకెట్టు నాలుగున్నర. అంటే రోజుకి 27 రూపాయలు!"

"అయ్యుండొచ్చు"

"ఇప్పుడు చూడండి. రోజుకి 27 రూపాయలంటే, ఏడాదికి 9,612 రూపాయలు. అంటే పదేళ్లలో ఒక లక్ష రూపాయలు. అవునా, కాదా?"

"అవును కాబోలు"

"కాబోలేమిటి, ఖచ్చితంగా ఔను! అంచేత మీరు కడచిన పదేళ్లు సిగరెట్లు కాల్చకుండా వుండుంటే ఆ ఎదర బిల్డింగు ఈ పాటికి మీది అయ్యుండేది!"

సిగరెట్లు కాల్చేవ్యక్తి వెంటనే లేచి ఆ బిల్డింగులోకి వెళ్లిపోతూ "నే నిదుగో, మా ఇంట్లో కెళ్ళిపోతున్నాను. మీ కెప్పుడేనా సిగరెట్టు కాల్చాలనిపిస్తే నిర్మొహమాటంగా లోపలి కొచ్చెయ్యండి. నా తలుపులూ నా సిగరెట్టు పెట్టే మీ కోసం ఎల్లప్పుడూ తెరిచి వుంటాయి!" అన్నాడట.

ఇంకా వారం రోజుల్లో పరీక్షలైపోతాయనంగా వొకరోజు "నీకు చదువైపోగానే ఉద్యోగం అత్యవసరం. ఔనా?" అన్నాను రమణమూర్తితో.

"ఔను మేష్టారూ"

"నువ్వు కొంచెం టైపు నేర్చుకుని వుంటే ఎంత బావుండేది!"

"టైపు హయ్యరు పాసయ్యాను కదండీ-?"

"అలాగా? ఐతే షార్ట్‌హాండ్ కూడా నేర్చుకో. చాలా ఎక్కువ అవకాశాలు వస్తాయి!"

"షార్టుహాండ్ లోయర్ అయిందండి. హయ్యర్‌కి వెళ్లాలి..."

"ఆ తరువాతుంది చూసేవూ. మనం తెలుగువాళ్లం. ఉద్యోగానికి ఇంకో రాష్ట్రానికి వెళ్లాలంటే బెరుకు! నువ్వు అలాంటివి పెట్టుకోకూడదు. అంచేత హిందీలో కొన్ని పరీక్షలు పాసవడం మంచిది! అంతకంటే కూడా, హిందీలో ధారాళంగా మాట్లాడ్డం నేర్చుకోవాలి..." అన్నాను.

"ప్రాథమిక, మాధ్యమిక ఇంటర్ చదువుతున్నప్పుడే అయిపోయాయండి. ఇప్పుడు 'రాష్ట్ర'కి ప్రిపేరవుతున్నానండి. మేం ఉన్న ఇంట్లోనే ఇంకో వాటాలో వున్న హిందూస్తానీ కుటుంబం వాళ్ల పుణ్యమా అని హిందీలో మాట్లాడ్డం బాగా వొచ్చేసిందండి."

మా ఆఫీసులో ఒక గుమస్తా ఉద్యోగం ఖాళీరాగానే మా ఆఫీసర్‌తో రమణమూర్తి గురించి గట్టిగా చెప్పేను. కాని ఆయన ఇంకో రకం ఆకర్షణలో పడిపోడం వల్ల ఆ ఉద్యోగం రమణమూర్తికి రాలేదు.

ఐదేళ్లు గడిచేక తెలిసింది. రమణమూర్తి రూర్కెలా స్టీల్ ప్లాంట్‌లో స్టెనోగా చేరి, అకౌంట్స్ క్లర్క్‌గా మారి జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌గా ప్రమోషన్ పొంది నెలకి రెండు వేలు తెచ్చుకుంటున్నాడని. వాళ్లనాన్నగారే కాశీలో కనబడి చెప్పేరు. ఆవిడ పోయారట. కాశీలో తర్పణం వదిలేడానికొచ్చేరుట. "ఏడాది సూతకం అయిపోయింది కదా. వాడికి ఇప్పుడే సమస్యలూ లేవు. చెల్లెలికి పెళ్లి చేసేడు. తమ్ముడికి ఓ దారి చూపించేడు. వీడు పెళ్లి చేసుకుంటే బావుణ్ణు." అని ఎంతో ఇదయ్యేడు, పాపం ముసిలాయన. రమణమూర్తి ఇన్నాళ్లూ, ఉదయమే లేచి తనే వంటచేసి ఆఫీసుకి వెడుతున్నాట్ట. ఇప్పుడతనికి ఇరవై ఏడేళ్లు.

అయితేనేం, మధ్య తరగతి కుటుంబాల్లో అతని అర్హతలు గొప్పవని లెక్కే.

అంచేత, వరసగా సంబంధాలు చూడ్డం మొదలెట్టేను.

కమల మా బావ మరిది కూతురు. బి.ఏ.పాసైంది. సంగీతం నేర్చింది. ఇంకా ఉద్యోగం రాలేదు గానీ సర్వీస్ కమిషన్ పరీక్ష రాసింది. మా బావమరిది కనీసం ఇరవై వేలు కట్నం ఇచ్చి మరో ముప్ఫయి వేలు ఖర్చు పెట్టి పెళ్లి చేయగలడు.

రజని మా తోడల్లుడిగారి తమ్ముడికూతురు. బియస్సీ దాకా చదివింది. డాన్స్ నేర్చింది. హరికథలు చెప్తుంది. దాని పేర విశాఖపట్నంలో 500 గజాల స్థలం, బాంకులో పాతికవేలూ ఉన్నాయి.

నళిని మా ఆఫీసు మేనేజర్‌గారి మేనకోడలు. ఎం.ఏ. తెలుగు, ఎం.ఏ. ఇంగ్లీషూ ఫస్టుక్లాస్‌లో పాసైంది. "సర్దాగా" ఈవ్నింగ్ కాలేజ్‌లో "జాబ్" చేస్తోంది. పత్రికల్లో వ్యాసాలు ఇంగ్లీషులోనూ, నవలలు తెలుగులోనూ రాస్తుంది. జాజ్, బీటిల్స్, వెంచర్స్, అబ్బా, బోనీ యం వంటి పాశ్చాత్య సంగీత బాణీలకు గీతాలకు పరవశంతో ప్రతిస్పందిస్తుంది. వాళ్లకి ఆ అమ్మాయి ఒక్కతే సంతానం. ఆ పిల్లని పెళ్లాడిన వాడికి రెండు లక్షల ఆస్తి కలిసొస్తుంది.

ఇలా, పది పదిహేను సంబంధాలు, ఒకదాన్ని మించిందొకటి, రూర్‌కెలాకి ఉత్తరాల ద్వారా తెలియజేస్తూనే, మూడేళ్లు గడిచిపోయాయి. పదిహేనో సంబంధం గురించి నేను రాసిన ఉత్తరం నాకే తిరిగొచ్చేసింది. అతనక్కడ లేడని!

పాపం, రమణమూర్తికి ముప్ఫయియేళ్లు వెళ్లిపోయాయి. చిన్నతనంలోనే ఆఫీసర్

అయిపోయికూడా ఇంకా అలా వొండుకుంటూ తండ్రికి పెడుతూ ఎంత యిబ్బంది పడుతున్నాడో అని ఒక రకంగానూ, నా దగ్గిర పాఠాలు చదువుకునీ కూడా అతనికి పెళ్లి సంబంధం ఖాయం చేసే కీర్తి నాకిచ్చేడు కాడని ఒక రకంగానూ బాధపడి వూరు కున్నాను.

"ఈ 1988 విభవ ఉగాది మీ ఇంట కూడా వసంతగీతం పాడాలని కోరుకుంటూ; మీ ఆప్తవర్గంలో - అన్నపూర్ణ, ఆర్.వి. రమణమూర్తి" అని ఒక అందమైన గ్రీటింగ్ కార్డు; కిందని చిన్నలైను కొట్టి "మీకు ఆహ్వానం పంపకుండానే పెళ్లి చేసుకున్నందుకు క్షమాపణలతో" అని కూడా అచ్చువేసివుంది. పోస్టులో వచ్చింది. అడ్రస్...ఆర్.వి.ఆర్, చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్, హిందూస్తాన్ మోటార్స్ లిమిటెడ్, కలకత్తా. ఫోను నెంబర్లు....

"ఓర్నీ!" అనుకున్నాను.

ఆఫీసు పనిమీద ఇంచుమించు నెలకోసారి "కల్కటా" వెళ్తూనే ఉన్నాను కదా. ఈసారి రమణమూర్తిని తప్పక కలవాలి! అని పట్టుదలతో వెళ్లాను.

అన్నపూర్ణకి ముప్ఫయ్యేళ్లుంటాయి. సామాన్యమైన చాయ; అంతకంటే సామాన్యమైన అందం. ఇన్నాళ్లు ఆగికూడా ఈమెని ఏం చూసి చేసుకున్నాడా అని ఆశ్చర్యం, చిరాకు పడ్డాను.

ఎనిమిదేళ్ల అబ్బాయి ఒకడు. ఐదేళ్ల పాప ఒకతీ ఉన్నారు ఆ ఇంట్లో. రమణమూర్తి తండ్రిగారు వరండాలో ఈజీచేర్లో వున్నారు.

"నాకొక సవితి అక్క వుండేది. మీకు తెలీదు. దాని పిల్లలు, వీళ్లిద్దరూను. వీళ్లమ్మా నాన్న కిందటేడు ఒక ఏక్సిడెంట్‌లో చచ్చిపోయేరు. అప్పట్నించీ వీళ్లు నా దగ్గిరే ఉన్నారు. ఉంటారు కూడా. ఇదుగో ఈవిడే అన్నపూర్ణ. మీ వూరే. జయంతి శంకరశాస్త్రి గారని ఉండేవారు. ఆరుగురు ఆడపిల్లల్లో ఈవిడే పెద్దది. ఈవిడ అందంగాలేదని, మెట్రిక్‌కి మించి చదువు లేదని, డాన్స్ రాదని, సంగీతం నేర్చుకోలేదని, పత్రికల్లో వ్యాసాలు, నవలలూ రాయడం చేతకాదని, ఈవిడని పెళ్లిచేసుకుందామని వచ్చి వాళ్లు ఇద్దరు ఈవిడ తరవాతి వాళ్లిద్దర్నీ చేసేసుకున్నారు. మిగిలిన ముగ్గురూ ఉద్యోగాలు చేస్తున్నారు కదా. అంచేత నెలనెలా జీతం రూపంగా వొచ్చే వెయ్యేసి రూపాయల కట్నానికి ఆశపడి మరో ముగ్గురు ఒప్పేసుకున్నారు. వాళ్లందర్నీ పెంచి పెద్దచేసిన ఈవిడ, నా సంసారంలో నాకున్న ఒకే ఒక ముఖ్యమైన అవసరం- అదే,'రెండు పూటలా ఆదరంగా అభిమానంగా కడుపు నిండా భోజనం!" - తీర్చలేక పోతుందా అని నేను పెళ్లి చేసుకున్నాను" అని చెప్పేడు రమణమూర్తి.

ఆపూట అక్కడే భోంచేసి "వెళ్లొస్తానమ్మా" అన్నాను, అన్నపూర్ణతో.

"దయ మాత్రం ఉంచండి బాబయ్యగారూ" అంది అన్నపూర్ణ.

*("ఆంధ్రభూమి" డెయిలీ : 4.5.88)*

*With the best compliments from*

**SRI KANAKA MAHALAKSHMI RICE & GROUNDNUT OIL MILLS**

**CHEEPURUPALLI**
**Vizianagram Dist.**